పథకాలను సద్వినియోగం చేసుకోవాలి


ఆలయ కమిటీ సభ్యులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు


చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ శ్రీనివాసరావు తదితరులు

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు
- 235 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు అందజేత

కేపీహెచ్‌బీకాలనీ: ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. మంగళవారం కేపీహెచ్‌బీలోని మండల రెవెన్యూ కార్యాలయంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల సంక్షేమమే తమ ధ్యేయమన్నారు. డివిజన్ల వారీగా 235 మంది లబ్ధిదారులకు స్థానిక కార్పొరేటర్లతో కలిసి చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ స్వామి, కార్పొరేటర్లు మందడి శ్రీనివాసరావు, పండాల సతీష్‌గౌడ్, ముద్దం నర్సింగ్‌యాదవ్, ఆవుల రవీందర్‌రెడ్డి, సబిహా బేగం, శిరీషాబాబూరావు, మహేశ్వరి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు సౌకర్యాలు కల్పించాలి..

కూకట్‌పల్లి: బోనాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా వసతులు కల్పించాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. మంగళవారం చిత్తారమ్మ దేవాలయాన్ని పరిశీలించారు. బోనాల ఏర్పాట్లపై ఆలయ కమిటీ సభ్యులతో చర్చించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, నాయకులు రంగారావు, చిన్న తులసి తదితరులు పాల్గొన్నారు.

ట్రేడ్ యూనియన్‌లపై అవగాహన ఉండాలి


సమావేశంలో మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె. విరాహత్ అలీ

టీయూడబ్ల్యూజే(ఐజేయూ) రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ

కూకట్‌పల్లి: విలేకరులు తమ వృత్తి నైపుణ్యంతో పాటు ట్రేడ్ యూనియన్ల విధి విధానాలపై అవగాహన పెంచుకోవాలని టీయూడబ్ల్యూజే(ఐజేయూ) రాష్ట్ర అధ్యక్షుడు కె. విరాహత్ అలీ అన్నారు. మంగళవారం యూనియన్ జిల్లా శాఖ, కూకట్‌పల్లి ప్రెస్‌క్లబ్ నేతృత్వంలో శేషాద్రినగర్ కమ్యూనిటీ హాల్‌లో సంఘం జిల్లా అధ్యక్షుడు బాలరాజు అధ్యక్షతన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల సరైన వైద్య సదుపాయాలు అందక పలువురు విలేకరులు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. అర్హులైన జర్నలిస్టులకు మాత్రమే అక్రిడిటేషన్ ఇవ్వాలన్నారు. మండల, జిల్లా కేంద్రాలుగా పరిగణలోకి తీసుకుని ఇళ్ల స్థలాలను మంజూరు చేసే విధంగా యూనియన్ కృషి చేస్తుందన్నారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షుడిని సన్మానించిన తర్వాత రాష్ట్ర కమిటీలో గ్రేటర్ హైదరాబాద్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న బాధ్యులను సత్కరించారు. సమావేశంలో యూనియన్ రాష్ట్ర కోశాధికారి మోతె వెంకటరెడ్డి, కొంపల్లి శ్రీకాంత్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాజేష్, గౌస్ మొయినుద్దీన్, అనిల్, చిన్న ప్రతికల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యూసుఫ్ బాబా, ప్రధాన కార్యదర్శి ఆశోక్, హెచ్‌యూజే అధ్యక్షుడు శిగ శంకర్‌గౌడ్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు అబ్బాయి, మామిడాల రవీందర్ రెడ్డి, సలీం పాషా, పరమేష్, మల్లారెడ్డి, భాస్కర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి వెంకట్రాంరెడ్డి, కూకట్‌పల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఎండీ శరీఫ్, రంజిత్, జిల్లా కార్యవర్గ సభ్యులు, ప్రెస్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

టీపీసీసీ లేబర్ సెల్ నియోజక వర్గ అధ్యక్షుడిగా భాస్కర్


నియామకపత్రాన్ని అందుకుంటున్న సప్పిడి భాస్కర్

మూసాపేట: మూసాపేటకు చెందిన సీనియర్ నాయకుడు సప్పిడి భాస్కర్‌ను టీపీసీసీ లేబర్ సెల్ కూకట్‌పల్లి నియోజకవర్గ అధ్యక్షుడిగా నియమించారు. ఈ మేరకు మంగళవారం టీపీసీసీ లేబర్ సెల్ చైర్మన్ ఆర్. ప్రకాష్‌గౌడ్ సప్పిడి భాస్కర్‌కు నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ.. నియోజకవర్గ పరిధిలో లేబర్ సెల్ బలోపేతం చేస్తూ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్రీధర్, సప్పిడి వినీత్, ఆశీష్, వీరేష్, కర్న మహేష్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్‌కు జీతం ఇప్పించిన కార్మిక నాయకుడు

మూసాపేట: కుత్బుల్లాపూర్, షాపూర్‌నగర్ ఇండస్ట్రీ ఏరియా నువోకో కార్పొరేషన్ లిమిటెడ్ రెడిమిక్స్ డ్రైవర్‌గా రుస్తుం అన్సారి కొన్ని సంవత్సరాలుగా పని చేస్తున్నాడు. అనివార్య కారణాల వల్ల డ్రైవర్ ఉద్యోగాన్ని మానేశాడు. దీంతో కాంట్రాక్టర్ శివారెడ్డి డ్రైవర్‌కు రెండు నెలల జీతం డబ్బులు రూ. 40 వేలు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నాడు. ఈ క్రమంలో బీఆర్‌ఎస్‌వీ కార్మిక సంఘం నాయకుడు రవినిగమ్‌ను సంప్రదించాడు. ఆతను కాంట్రాక్టర్‌తో చర్చించి డ్రైవర్‌కు రావాల్సిన వేతనాన్ని ఇప్పించాడు. కార్యక్రమంలో అనిల్, సుదర్శన్, జగన్, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.


డ్రైవర్‌కు జీతం ఇప్పిస్తున్న కార్మిక నాయకుడు రవినిగమ్ తదితరులు

బైక్ దొంగ అరెస్టు

మూసాపేట: బైక్‌లను చోరీ చేస్తున్న నిందితుడిని అరెస్టు చేసి పోలీసులు రిమాండ్‌కు తరలించారు. 10 ద్విచక్ర వాహనాలను రికవరీ చేశారు. ఈ సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం... కూకట్‌పల్లి వివేకానందనగర్‌కు చెందిన మార్వాడీ కిరణ్‌రాయ్ (44) తండ్రితో కలిసి నివసిస్తున్నాడు. చెడు వ్యసనాలకు బానిసై అవసరాల కోసం డబ్బులు సరిపోక ఇబ్బందులు, మెట్రో స్టేషన్ల వద్ద పార్కింగ్ చేసిన బైకులను చోరీ చేస్తున్నాడు. కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ క్రైమ్ టీం ప్రాంతంలో నంబర్‌ప్లేట్ లేని ఎఫ్‌జెడ్ వాహనంపై తిరుగుతుండగా పోలీసులకు పట్టుబడ్డాడు. వాహన పత్రాలు లేకపోవడంతో దొంగతనం చేసిన వాహనం అని తేలింది. ఇతనిపై ఇంతకు ముందు పలు దొంగతనం కేసులు నమోదయ్యాయి. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ప్రైవేట్ ఆసుపత్రులపై నజర్

పకడ్బందీగా క్లినిక్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం అమలు

- అధిక ఫీజులపై చట్టపరమైన చర్యలు
- ఆసుపత్రులు, డయాగ్నోస్టిక్, స్కానింగ్ కేంద్రాల్లో ధరలు, వైద్య పరీక్షల వ్యయ పట్టిక తప్పనిసరి
- అనుమతి లేని వారు సత్వరమే దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం
- నగర శివారుల్లో పుట్టగొడుగుల్లా ఆసుపత్రులు, క్లినిక్‌లు, డయోగ్నోస్టిక్ సెంటర్లు తదితరాలు



సాక్షి, సిటీబ్యూరో: అనుమతులు లేకుండా వైద్య సేవలు అందిస్తూ.. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడే ప్రైవేట్ ఆసుపత్రులపై వైద్యాధికారులు ఇకపై కొరడా ఝుళిపించనున్నారు. ఈ నేపథ్యంలోనే 'క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం–2010, నిబంధనలు–2022'ను పకడ్బందీగా అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి ఐజీపీల జిల్లా వైద్యాధికారులతో చట్టం అమలు తీరుపై పలు సూచనల చేయడమేగాక స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. మేనేజ్‌మెంట్, పొల్యూషన్, ట్రేడ్ లైసెన్స్‌తో సహా అగ్నిమాపక పత్రాలు సరిగ్గా ఉన్నప్పుడే ఆసుపత్రుల ఏర్పాటుకు అనుమతి మంజూరు చేస్తారు.

అనుమతులకు నిబంధనలు ఇలా...

అల్లోపతి ప్రైవేటు మెడికల్ కేర్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం ప్రకారం ప్రైవేట్ ఆసుపత్రులు, క్లినిక్‌లు, డయోగ్నోస్టిక్ సెంటర్లు, కన్సల్టెంట్ క్లినిక్‌లు, ఆయుష్ క్లినిక్‌లు, ఫిజియోథెరపీ కేంద్రాలకు అనుమతి తప్పనిసరి. నిబంధనల ప్రకారం జిల్లా వైద్యారోగ్యశాఖలో దరఖాస్తు చేసుకోవాలి. అలా దరఖాస్తు చేసుకున్న ఆసుపత్రి, క్లినిక్, డయాగ్నస్టిక్ కేంద్రాల నిర్వాహకులు అందులో పనిచేసే వైద్యుల రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా ఉండాలి. అగ్నిమాపక, బయో వేస్ట్ మేనేజ్‌మెంట్...

అనుమతి లేకపోతే సీజ్ చేస్తాం

ఎలాంటి అనుమతులు లేకుండా బోగస్ ప్రకటనలతో వైద్యం చేస్తే ఆసుపత్రులను సీజ్ చేసి, క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం. అనుమతులు లేని వారు వెంటనే దరఖాస్తు చేసుకోవాలి. ప్రభుత్వం నిర్ణయించిన ఫైడ్ డాక్టర్లు, నర్సులు, పారామెడికల్ సిబ్బంది ఉండేలా చూసుకోవాలి. ఆసుపత్రులను నడపాలి. చట్టంలో పొందుపర్చిన ప్రకారం ఆసుపత్రుల్లో ధరల పట్టికను తప్పనిసరిగా ప్రదర్శించాలి.
– డాక్టర్. రఘునాథస్వామి, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి

అనుమతి లేనివెన్నో..?

నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 2,600 పైగా ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రులు ఉండగా, ఇందులో రిజిస్ట్రేషన్‌తో సహా పలు రకాల అనుమతులతో కొనసాగుతున్న ఆసుపత్రులు 1705 మాత్రమే ఉన్నాయి. ఎలాంటి అనుమతి లేని ప్రైవేట్ ఆసుపత్రులు 895 ఉన్నట్లు వైద్యారోగ్యశాఖ అంచనా వేసింది. అనుమతులు ఉన్న ఆసుపత్రుల్లో వంద కంటే ఎక్కువ పడకలు(బెడ్స్) ఉన్న ప్రైవేట్ ఆస్పత్రులు 48 ఉండగా, 20 నుంచి 100 పడకలు(బెడ్స్) ఉన్న ఆస్పత్రులు 317 ఉన్నట్లు వైద్యారోగ్యశాఖ పేర్కొంటోంది. 20 పడకలు (బెడ్స్) ఉన్న ఆస్పత్రులు 294 ఉన్నాయి. అలాగే, 712 పాలీక్లినిక్‌లు, క్లినిక్‌లు, డయాగ్నొస్టిక్ సెంటర్లు,180 డెంటల్ ఆస్పత్రులు, 46 ఫిజియోథెరపీ సెంటర్లు, 08 డయాలిసిస్ సెంటర్లు ఉన్నాయి. అలాగే అనుమతి పొందిన స్కానింగ్ సెంటర్లు 628 ఉండగా అక్రమంగా కొనసాగుతున్న స్కానింగ్ సెంటర్లు 400 వరకు ఉన్నట్లు వైద్యారోగ్యశాఖ వర్గాలు పేర్కొంటున్నాయి.

శివారుల్లో పుట్ట గొడుగుల్లా ...

నగర శివారు మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లాలో 15 మండలాలు, 13 పురపాలక సంఘాలు ,61 గ్రామ పంచాయతీలు ఉండగా, ఆయా ప్రాంతాల్లో పదుల సంఖ్యల్లో ప్రైవేట్ ఆసుపత్రులు, క్లినిక్‌లు డయాగ్నస్టిక్స్, స్కానింగ్ కేంద్రాలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. వీటిలో కొన్నింటికి మాత్రమే అనుమతులున్నాయి. మిగతా వాటికి లేనున్నా.. వైద్య సేవలు కొనసాగుస్తున్నారు. కొన్ని సందర్భాల్లో మరణాలు సంభవించినా విచారణకు వెళ్లే వైద్యాధికారులకు సదరు ఆసుపత్రి లేదా, చికిత్స చేసేందుకు వైద్యుడికి అనుమతి లేదని గుర్తించి చర్యలకు ఉపక్రమిస్తున్నారు. ఈ నేపథ్యంలో 'క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టాన్ని' పకడ్బందీగా అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.



వ్యయ పట్టికలు తప్పని సరి..

నగర శివారు ప్రైవేట్ ,కార్పొరేట్ ఆసుపత్రుల్లో అధిక ఫీజుల దోపిడీ మొదలు వైద్య పరీక్షలు తదితర వాటిల్లో కొనసాగుతున్న దోపిడీని పసిగట్టిన జిల్లా వైద్యారోగ్య శాఖ బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించింది. ప్రతి ఆసుపత్రిలో డయాగ్నస్టిక్స్, స్కానింగ్ కేంద్రాల్లో చికిత్స, వైద్య పరీక్షలకు అయ్యే వ్యయ పట్టిక ఏర్పాటు చేయాలి. లింగ నిర్ధారణ చేయమని బోర్డులు ఏర్పాటు చేయాలి. డాక్టర్లు, సిబ్బంది, బెడ్ల(పడక మంచాలు) సంఖ్య వంటి సమాచారాన్ని పొందుపర్చాల్సి ఉంటోంది. డయాగ్నోస్టిక్ కేంద్రాలు, ఆసుపత్రుల్లో అర్హత గల వైద్యులు, సాంకేతిక నిపుణులను నియమించుకోవాలి. కన్సల్టేషన్ వైద్యుడిని రప్పించి వైద్యం అందిస్తే అందుకు సంబంధించిన అఫిడవిట్ దాఖలు చేయాలి. క్రమం తప్పకుండా ఫారం–ఎఫ్‌ను సమర్పించాలి.

కూలిన భారీ వృక్షం.. తొలగించిన సిబ్బంది



మోతీనగర్: మూసాపేట డివిజన్, మోతీనగర్ బాలాజీ అపార్ట్‌మెంట్ సమీపంలో భారీ వృక్షం నేలకొరిగి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. విషయాన్ని స్థానికులు మోతీనగర్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ మాజీ అధ్యక్షుడు నల్లమోతు శ్రీనివాసరావు డీఆర్‌ఎఫ్ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే డీఆర్‌ఎఫ్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు చేరుకొని భారీ వృక్షాన్ని తొలగించారు. రాకపోకలు సజావుగా సాగేలా చర్యలు తీసుకున్నారు. డీఆర్‌ఎఫ్ సిబ్బందికి పలువురు కృతజ్ఞతలు తెలిపారు.

నివారణ మార్గాలే రక్షణ చర్యలు

- ఎంటమాలజీ ఏఈ నగేష్
- దోమల నివారణపై అవగాహన ర్యాలీ


అవగాహన కల్పిస్తున్న ఎంటమాలజీ సిబ్బంది

మూసాపేట: దోమ కాటు వల్ల మలేరియా, డెంగీ, చికున్‌గున్యా వంటి రోగాలు వస్తున్నాయని, నివారణ మార్గాలే రక్షణ చర్యలు అని ఎంటమాలజీ ఏఈ నగేష్ అన్నారు. మూసాపేట వార్డు కార్యాలయంలో డెంగీ, మలేరియాపై మహిళా సంఘాల సభ్యులకు మంగళవారం అవగాహన కల్పించి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటి పరిసరాలు, పూల కుండీలు, టైర్లలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. దోమల నియంత్రణలో ప్రజల పాత్ర ఉందని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఓ మురళి, ఎస్‌ఎఫ్ఏ జమీల్, యాదగిరి, మహిళా సంఘాల సమాఖ్య అధ్యక్షులు, ఆర్పీలు, ఎంటమాలజీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వ్యాక్సినేషన్‌పై ఆశాలకు అవగాహన


వ్యాక్సినేషన్‌పై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ ఎలిజా కెనడీ

ఓల్డ్ బోయిన్‌పల్లి: పిల్లలకు మెదడువాపు వ్యాధి రాకుండా వేసే టీకా వ్యాక్సిన్‌పై ఆశావర్కర్లకు మంగళవారం అవగాహన కల్పించారు. వ్యాధి ఎలా వ్యాప్తి చెందుతుంది, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ ఐడీహెచ్ కాలనీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ ఎలిజా కెనడీ అవగాహన కల్పించారు. 9 నెలల నుంచి 15 సంవత్సరాల పిల్లలకు ఈ వ్యాక్సిన్ వేయనున్నట్లు తెలిపారు. ఆదేవిధంగా రెండు సంవత్సరాలలోపు పిల్లలకు 9వ నెల మొదటి డోస్, 17వ నెల రెండవ డోస్ ఇవ్వనున్నట్లు తెలిపారు.

వేధింపులు తాళలేక గృహిణి ఆత్మహత్య


అరుణ (ఫైల్)

నిజాంపేట: భర్త వేధింపులు తాళలేక ఓ గృహిణి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. బాచుపల్లి సాయినగర్‌కు చెందిన ఎర్రగొల్ల గోపి, అరుణ భార్యాభర్తలు. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అరుణకు ఇద్దరు కుమార్తెలు జన్మించడంతో భర్త గోపి వేధింపులు మొదలు పెట్టాడు. అదనపు కట్నం తేవాలని కాలీకరణంగా, మానసికంగా అరుణను వేధించడంతో ఈ విషయమై పలుమార్లు తల్లిదండ్రులు ఇద్దరికి పెద్దల సమక్షంలో కౌన్సెలింగ్ ఇప్పించారు. ఇటీవల వేధింపులు మరింత తీవ్రతరం కావడంతో ఈనెల 15న అరుణ ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తల్లిదండ్రులు వచ్చేలోపే అరుణ మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రి శవాగారానికి తరలించారు. దీంతో తమ కుమార్తె మృతిపై అనుమానాలున్నాయంటూ, భర్త వేధింపులతో మృతి చెందిందని అరుణ తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బాచుపల్లి ఎస్‌ఐగా శ్రీనివాసులు

నిజాంపేట: బాచుపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐగా పని చేస్తున్న మహేష్‌గౌడ్ గచ్చిబౌలి స్టేషన్‌కు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో కొత్తూరు పీఎస్‌లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసులు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలన్నారు.

అక్రమ పార్కింగ్

- రోజుల తరబడి బోయిన్‌పల్లి చెరువు కట్టపై వాహనాలు
- నామమాత్రంగా పోలీసుల చర్యలు
- రాత్రి వేళ గంజాయి మత్తులో యువత!
- పోలీసుల పర్యవేక్షణ అంతంతే


చెరువు కట్టపై ఇరువైపులా పార్కింగ్ చేసిన వాహనాలు

ఓల్డ్ బోయిన్‌పల్లి: హస్మత్‌పేట బోయిన్‌చెరువు కట్టపై వాహనాల పార్కింగ్‌కు అడ్డాగా మారింది. దీంతో అటు నుంచి రాకపోకలు సాగించే ఇతర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌కు ప్రధాన రహదారుల్లో ఇది ఒకటి. రోజుల తరబడి వాహనాలు అక్కడే ఉన్నా పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం లేదన్న విమర్శలు కూడా ఉన్నాయి. ఏదో అప్పుడప్పుడు చలాన్లు విధిస్తూ చేతులు దులుపుకుంటున్నారని స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. కట్టపై రాత్రి పూట యువత గంజాయి మత్తులో మునిగి కత్తులతో దాడి చేసుకున్నటువంటి ఘటనలు కూడా ఉన్నాయి. చెరువుకట్ట పొడవు రెండు వైపులా వాహనాలను అక్రమ పార్కింగ్ చేస్తున్నారు. చెరువు కట్ట మొదలు కట్ట మైసమ్మ ఆలయం వద్ద వంపుగా ఉండటంతో పార్కింగ్ చేసిన వాహనాలు కన్పించకపోవడంతో ఆటోలోనే వస్తున్న వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి.

రాత్రిపూట గంజాయి మత్తులో..

చెరువు కట్టపై యువత గంజాయి మత్తులో మునుగుతున్నట్లు తెలుస్తోంది. పది రోజుల క్రితం మత్తులో యువత కత్తులతో దాడి చేసుకున్నట్లు స్థానికులు తెలిపారు. ఇలా ఏదో ఒక సంఘటన పునరావృతం అవుతున్నా పోలీసులు పటిష్టమైన చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. భయంతో చెరువు కట్టపై ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. పార్కింగ్ విషయంపై అల్వాల్ పోలీసులు దృష్టి సారించి అక్రమ పార్కింగ్, అసాంఘిక కార్యకలాపాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వివేక్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా శ్రీనివాస్


అధ్యక్షుడిగా ఎన్నికైన శ్రీనివాస్ తదితరులు

కూకట్‌పల్లి: వివేక్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నిక కోసం మంగళవారం జరిగిన ఎన్నికలో అధ్యక్షుడిగా ముత్యపాగ శ్రీనివాస్ విజయం సాధించారు. ప్రధాన కార్యదర్శిగా వొల్లాల అనిల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కోశాధికారిగా లింగాల రవీందర్ విజయం సాధించారు. అనంతరం ముత్యపాగ శ్రీనివాస్ మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారానికి సమన్వయంతో ముందుకెళ్తానన్నారు.

ది మాస్టర్ మైండ్స్ స్కూల్‌పై చర్యలు తీసుకోవాలి


పాఠశాల ఎదుట ధర్నా చేస్తున్న జేఏసీ నాయకులు

కూకట్‌పల్లి: గోపాల్‌నగర్‌లోని ది మాస్టర్ మైండ్స్ స్కూల్‌పై చర్యలు తీసుకోవాలని ఓయూ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ప్రభుత్వ అనుమతి లేకుండా అధిక ఫీజులు వసూలు చేస్తూ తరగతులు నిర్వహిస్తున్నారని మంగళవారం పాఠశాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ..పాఠశాలలో పుస్తకాలు, యూనిఫాం విక్రయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్పొరేట్ విద్యా సంస్థలపై అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు.

ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదగాలి


గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమంలో విద్యార్థినులు, కళాశాల సిబ్బంది

కూకట్‌పల్లి: విద్యార్థినులు ఉద్యోగాల వేటకే పరిమితం కాకుండా ఇతరులకు అవకాశాలు కల్పించే స్థాయికి ఎదగాలని ప్రగతి మహిళా కళాశాల డైరెక్టర్ రవీందర్‌రావు అన్నారు. వివేకానందనగర్‌లోని కళాశాల గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం ఏటీఓ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి పట్టాలు, బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అనురాధ, అధ్యాపకులు, సిబ్బంది, తల్లిదండ్రులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలి


హైదర్‌నగర్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, పాఠశాల సిబ్బంది

కూకట్‌పల్లి: విద్యార్థులు నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని కేపీహెచ్‌బీ ఇన్‌స్పెక్టర్ ఎం వెంకటేశ్వర్లు అన్నారు. కేపీహెచ్‌బీ రవీంద్రభారతి పాఠశాలలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమానికి హాజరై విద్యార్థుల నాయకత్వ లక్షణాలు కలిగి ఉండాలని వివరించారు. వివిధ విభాగాల్లో నాయకులుగా ఎంపికైన వారిని అభినందించారు. ఆదేవిధంగా హైదర్‌నగర్ బ్రాంచ్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ఎస్ఐ మన్యం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శిరీష, ఇందిర, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వాగును తలపిస్తున్న రోడ్డు



కూకట్‌పల్లి: నియోజకవర్గంలోని కూకట్‌పల్లి డివిజన్ ఫతేనగర్ ప్రధాన రహదారి వాగును తలపిస్తుంది. ఇటీవల కురిసిన వర్షానికి నీరు అంతా రోడ్డుపై చేరింది. జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిలిచిన వర్షపు నీటిని తొలగించాలని కోరుతున్నారు.

రేషన్ కార్డులను మంజూరు చేయాలి

బాలానగర్: అర్హులైన పేదలకు రేషన్ కార్డులను మంజూరు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు రాజశేఖర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం బాలానగర్ ఫిరోజ్‌గూడలోని సివిల్ సప్లై కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే రేషన్ కార్డులు ఇస్తామని ప్రచారం చేసి, అధికారంలోకి వచ్చాక విస్మరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో శంకర్, సతీష్, భాగ్యలక్ష్మి, భారతి, ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి చాక్లెట్లు విక్రయిస్తున్న మహిళ అరెస్టు

జగద్గిరిగుట్ట: కిరాణా షాపులో గంజాయి చాక్లెట్లు విక్రయిస్తున్న ఓ మహిళను అరెస్టు చేసిన ఘటన జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బిరసినగర్‌లో ఏ–బ్లాక్, రోడ్డు నెంబర్–8లో విద్యార్థులే టార్గెట్‌గా సునీత దేవి అనే ఓ మహిళ కిరాణా షాపులో గంజాయి చాక్లెట్లు విక్రయిస్తుంది. పక్కా సమాచారంతో మంగళవారం బాలానగర్ ఎస్‌ఓటీ పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకున్నారు. మహిళ వద్ద నుంచి 9.5 కిలోల గంజాయి చాక్లెట్లు స్వాధీనం చేసుకొని జగద్గిరిగుట్ట పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి ఈ గంజాయి ఎక్కడి నుండి సరఫరా చేసుకుంటున్నారని.. మహిళకు ఎవరు సహాయం చేస్తున్నారు..ఇంకా ఎంత మంది ఇందులో భాగస్వాములుగా ఉన్నారు..అన్న కోణంలో దర్యాప్తు చేపట్టారు.